విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఉత్తమ చిత్రంగా 'కొండమ్మ'కు బహుమతి

విశాలాంధ్ర-తాడేపల్లి : ప్రముఖ కవి దాశరథి శతజయంతిని పురస్కరించుకుని దాశరథి ఫిల్మ్ సొసైటీ హైదరాబాద్ వారు నిర్వహించిన లఘుచిత్రాల పోటీలలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన త్రినేత్ర ప్రొడక్షన్స్ వారి 'కొండమ్మ' చిత్రానికి టాప్-4గా బహుమతి దక్కింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో అతిథుల చేతులమీదుగా షీల్డ్, సర్టిఫికెట్‌ను కొండమ్మ చిత్రంలో ప్రధాన పాత్ర పోషించిన ఇల్లా మాధవి అందుకున్నారు. కొండమ్మ చిత్ర కథాంశాన్ని, నటీనటుల పాత్రోచిత నటనను, గాదె నాగభూషణం దర్శకత్వ ప్రతిభను వక్తలు కొనియాడారు. కాగా రెండు తెలుగురాష్ట్రాలలోని షార్ట్ ఫిల్మ్ మేకర్స్ కొండమ్మ టీమ్‌ను ప్రశంసలతో ముంచెత్తారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ట్రావెల్ బస్సు

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని జీబీసీ రోడ్డు శ్రీ భావన్నారాయణ స్వామి దేవస్థానం వద్ద సోమవారం తెల్లవారుజామున ప్రైవేటు ట్రావెల్ బస్సు డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదవశాత్తు జరిగినట్టు బస్సు డ్రైవర్ తెలిపారు. ప్రథమ చికిత్స నిమిత్తం ప్రయాణికులను ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సృజనాత్మకత పెంపొందించాలి

విశాలాంధ్ర-పొన్నూరు : పాఠ్యాంశాలకు తోడుగా చక్కటి టీఎల్ఎం బోధన తోడైతే విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని పొన్నూరు ఎంఈఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం చింతలపూడి గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో బోధనోపకరణాల ఎగ్జిబిషన్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు ఎగ్జిబిషన్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ

విశాలాంధ్ర-దుగ్గిరాల : గణేష్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, ఎరేజర్లు, షార్ప్‌నర్లు తదితర స్టడీ మెటీరియల్స్‌ను తాడిబోయిన వెంకటేశ్వరరావు యాదవ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు తాడిబోయిన రామస్వామి యాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు చిరు ప్రోత్సాహం అందిస్తే వారు కూడా గుణాత్మక విద్యను అభ్యసించి జీవితంలో ఎదగడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. గత 8 సంవత్సరాల నుంచి కూడా తమ తండ్రి పేరు మీద ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ వెంకటేశ్వరరావు నిబద్ధతను, వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కరిముల్లా, వెంకటేష్, తాడిబోయిన గంగ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, అధ్యాపకురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో రోడ్డు మరమ్మతులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో కురగల్లులో రహదారి మరమ్మతు పనులు సోమవారం ప్రారంభించారు. మంగళగిరి మండలం, కురగల్లు గ్రామంలో ప్రధాన రహదారి గుంతలమయమై స్థానికులు, వాహనదారులు, ఇదే రహదారి నుంచి రాకపోకలు సాగించే ఇతర గ్రామాల ప్రజలు, ఇదే గ్రామ పరిధిలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని లోకేష్ దృష్టికి తీసుకురాగా ఆయన సొంత నిధులతో గుంతలు పూడ్చే పనులను మొదలు పెట్టించారు.

కళాశాల అభివృద్ధికి విరాళం

విశాలాంధ్ర-పెదనందిపాడు : స్థానిక పీఏఎస్ కళాశాల అభివృద్ధికి నెల్లూరు జిల్లా ఇందుకూరిపేట వాసి అమెరికాలో నివసిస్తున్న ఎన్నారై గురజాల వెంకట లక్ష్మి నరసింహ ప్రసాద్ రూ.50 వేల విరాళాన్ని అందజేసినట్లు ప్రిన్సిపాల్ గుర్రం వీర రాఘవయ్య సోమవారం తెలిపారు. గత నెలలో కళాశాల అధ్యక్షులు రిటైర్డ్ ఏఎస్పీ కాళహస్తి సత్యనారాయణ తన అమెరికా పర్యటనలో చేసిన విజ్ఞప్తి మేరకు ఆయన విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాతను కళాశాల కమిటీ సభ్యులు, అధ్యాపకులు అభినందించారు.

గుంటూరు హై లెవల్ ఛానల్‌కు
మరమ్మతులు చేయండి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి గుంటూరు జిల్లాకు (మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, గుంటూరు నియోజకవర్గాలకు) తాగు, సాగు నీరు అందించే 47 కిలోమీటర్ల గుంటూరు హై లెవల్ ఛానల్‌కు తక్షణమే మరమ్మతులు నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బుడంపాడు వద్ద ఉన్న గుంటూరు హై లెవల్ ఛానల్ కాలువను సోమవారం సీపీఐ, రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు హై లెవెల్ ఛానల్ కాలువ గుర్రపు డెక్క, నాచు, తుటాకులతో నిండిపోయి దుర్గంధ పూరితంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలువ ద్వారా 10 వేల ఎకరాల మెట్ట, 20 వేల ఎకరాల మాగానికి నీరు అందుతుందని, 30 గ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలకు ఈ నీటిని వాడుతున్నారని తెలిపారు. ఈ కాలువపై ఉన్న చాప్టలు బలహీనపడి పగుళ్ల ఏర్పడటంతో గుంటూరుతో పాటు ఉండవల్లి, తాడేపల్లి, మంగళగిరి, పెదకాకాని తదితర ప్రాంతాల నుంచి మురుగునీరు ఈ కాలువలో కలుస్తుందని చెప్పారు. దీనితో పాటు గుర్రపు డెక్క, తూటాకు, ప్లాస్టిక్ తదితర వ్యర్థ పదార్థాలతో కాలువ నిండిపోయి ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం నిధులు తగినవిధంగా కేటా యించక, కేటాయించిన నిధులు సక్రమంగా వినియోగించక ఛానల్ పనులలో కాలయాపన జరుగుతుందని, ఈ సంవత్సరమైన కాలువ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువకు మరమ్మతులు చేయించి, ప్రజలకు పరిశుద్ధమైన తాగు, సాగునీరు అందించడానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ పాల్గొన్నారు.

సమన్వయంతో వ్యాధులను అరికట్టండి: కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలో కీటక జనిత, కలుషిత నీటికారక వ్యాధులు, సీజనల్ వ్యాధులు నివారణ, వ్యాప్తిని అరికట్టేందుకు వైద్యారోగ్య, పంచాయితీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం అన్ని ముందస్తు జాగ్రత్తలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి తదితర అంశాలపై జిల్లా అధికారులతో కలసి మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కీటక జనిత వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. డెంగీ కారక దోమలు ఎక్కువగా తాజా నీటిలో పెరుగుతాయని, యాంటీ లార్వా కార్యక్రమాలు ప్రకట్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాలు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం నిర్వహించటంతో పాటు క్షేత్ర స్థాయి ఉద్యోగులు ప్రతి ఇంటికి వెళ్ళి హైజనిక్ యాప్‌లో స్థానిక పరిస్థితుల వివరాలను నమోదు చేయాలన్నారు. యాప్‌లో నమోదు చేసిన అంశాలను సంబంధిత శాఖల అధికారులు సత్వరమే పరిష్కరించాల న్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేలా విద్యాశాఖ అధికారులతో పాటు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, ప్రత్యేక అధికారులు వారానికి కనీసం ఒకసారి పాఠశాలలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచటంతో పాటు, ప్రతిఒక్కరూ మధ్యాహ్న భోజనం తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతులకు పంట రుణాలతో పాటు ప్రభుత్వం అందించే ఇతర రాయితీల అమలు కోసం సీసీఆర్సీ కార్డులు నిర్దేశించిన మేరకు మంజూరు అయ్యేలా వ్యవసాయశాఖ అధికారులను సమన్వయం చేసుకొని రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సుమోటో ఇంటిగ్రేటెడ్ సర్టిఫికేట్లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యాన పంట సాగు, ఎవెన్యూ, ఇనిస్ట్యూషనల్, కెనాల్ ప్లాంటేషన్‌కు మండల స్థాయి ప్లానింగ్‌ను ఎంపీడీవోలు వెంటనే అందించాలని, మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. విశ్వకర్మ పథకంకు అందించిన దరఖాస్తులను మండల స్థాయి అధికారులు వెంటనే వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. భారీ వర్షాలు, కృష్ణానదికి నీటి విడుదలవుతున్న నేపథ్యంలో ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువ ఉన్న నది పరివాహక గ్రామాల్లో పరిస్థితులను రెవెన్యూ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మీకుమారి, గంగరాజు, సీపీఓ శేషశ్రీ, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, డీఈఓ శైలజ, వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖ అధికారి రవీందర్, డ్వామా పీడీ ఉమాదేవి, బీసీ కార్పోరేషన్ ఈడీ దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీయుల సమగ్రాభివృద్ధికి విద్య దోహదం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పద్మశాలీలు ఉన్నత విద్యావంతులుగా ఎదగడం ద్వారానే సామాజిక, రాజకీయ, ఆర్థిక స్వాతంత్రాలను అందిపుచ్చుకుంటారని గుంటూరు నగర పద్మశాలీయ సంఘం అధ్యక్షులు గుర్రం చిన్న వీరయ్య పేర్కొన్నారు. నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో 500 మంది పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్య ఉపకరణాలతో పాటు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ విద్యార్థులకు మెరిట్ స్కాలర్షిప్‌లు అందించే కార్యక్రమం స్థానిక గుజ్జనగుండ్ల ప్రగడ కోటయ్య చేనేత భవన్ సమావేశ మందిరంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన నగర అధ్యక్షులు చిన్న వీరయ్య మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా దాతల సహకారంతో నగర పద్మశాలి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గోలి ద్రాక్షాయమ్మ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వారిచే పది మందికి రూ.2వేలు చొప్పున, పదవ తరగతి, ఇంజనీరింగ్, పాలిటెక్నిల్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన 20 మందికి రూ.2వేలు చొప్పున మెరిట్ స్కాలర్షిప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ జి.సూర్యనారాయణ, డాక్టర్ పులిపాటి కోటేశ్వరరావు, డాక్టర్ అందే వెంకటేశ్వరరావు, విద్యావేత్త మురుగుడు శ్రీహరి, విశ్రాంత బ్యాంకు ఉన్నతాధికారులు ఆకురాతి అమర్నాథ్, రామనాథం పరమేశ్వరరావు, కార్యంపూడి వాసుదేవరావు, సంఘం ప్రధాన కార్యదర్శి పడవల రఘురాం, గోలి వెంకటేశ్వరరావు, గోలి వెంకట సుబ్బారావు, యంగల శ్రీధర్, వెనిగళ్ళ శ్రీనివాసరావు, మాచర్ల వీర రాఘవయ్య, చిలువేరు గణేష్, జొన్నాదుల సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: మాల్యాద్రి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్(ఆప్కోస్) పారిశుద్ధ్య కార్మికుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నగర ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. గత కొంతకాలం నుంచి ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆర్థికంగా, మానసికంగా ఆందోళనకు గురౌతున్నారని అన్నారు. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులకు సచివాలయాల పరిధిలో వేస్తున్న మస్టర్‌లు నిలుపుదల చేయాలని, శానిటరీ కార్యాలయాల వద్దనే మస్టర్‌లు వేయాలని, 62 సంవత్సరాలు పూర్తి అయినవని నిలుపుదల చేసిన, మరణించిన, అనారోగ్యంతో పనులు చేయలేకపోయిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకోవాలని, ఆదివారం పూర్తి సెలవు, ప్రభుత్వ జాతీయ సెలవులను పూర్తిగా అమలు చేయాలని, నగర జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, బదిలీ కార్మికులను ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా పూర్తి స్థాయి కార్మికులుగా కొనసాగించాలని, కొవిడ్-19 సమయంలో పారిశుద్ధ్య పనుల కోసం తీసుకున్న కార్మికులను యధావిధిగా పనులలోకి తీసుకుని జీవనభృతి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కోటి వీరాంజనేయులు, శివకుమారి, మేకం శ్రీనువాసు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థినికి రాష్ట్ర స్థాయి ఆర్కిటెక్ట్ అవార్డు

విశాలాంధ్ర-తాడేపల్లి : కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో ఆర్కిటెక్ట్ విభాగంలో చివరి సంవత్సరం చదువు తున్న సుంకర మౌనిక అనే విద్యార్థిని నిర్మాణ శైలిలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అవార్డు సాధించి నట్లు కేఎల్ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి డాక్టర్ ఎ.ప్రియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్లో ది ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్కిటెక్ట్స్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆర్కిటెక్చర్ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆయా ఇంజనీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పోటీ పడగా కేఎల్ వర్సిటీలో ఆర్కిటెక్ట్ విభాగంలో చివరి సంవత్సరం చదువుతున్న సుంకర మౌనిక అనే విద్యార్థిని అత్యంత ప్రతిభ కలిగిన థీసిస్‌ను ప్రదర్శించినట్లు ఆమె తెలిపారు. ముంబైలోని కామటిపుర అనే పట్టణాన్ని పునర్నిర్మాణం గురించిన సమస్యకు అత్యంత సులువుగా పరిష్కారం చూపినందుకు గాను మౌనికకు ఈ అవార్డు లభించిందన్నారు. అవార్డును సుంకర మౌనికకు విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఐఐఏ చైర్మన్ ఆర్కిటెక్చర్ విజయ భాస్కర్ ఇ, కన్వీనర్ ఆర్కిటెక్చర్ క్రాంతికుమార్ ఎం తదితరులు అందజేసారని అన్నారు. ఈ సందర్భంగా కేఎల్ వర్సిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, డాక్టర్ కె.రాజశేఖర రావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఆర్కిటెక్చర్ విభాగాధిపతి డాక్టర్ ఎ.ప్రియా, ఉప విభాగాధిపతి తదితరులు సోమవారం వర్సిటీలోని వీసీ చాంబర్‌లో సుంకర మౌనికను అభినందించారు.

వసతి గృహాలకు మెష్ ఏర్పాటు

విశాలాంధ్ర-తాడికొండ : సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బీసీ బాలికల వసతి గృహాలకు సోమవారం మెష్ ఏర్పాటు చేశారు. ఈ నెల 16న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి వసతి గృహాలను సందర్శించారు. పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ త్వరితగతిన వసతి గృహాలకు మెష్ ఏర్పాడి చేయాలని ఆదేశించడంతో తహశీల్దారు పి.మధుసూదన్ రావు స్పందించారు. విషయాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లడంతో వ్యాపారులు దగ్గు మల్లి కమలాకర్, నల్లపలేని లీలా శంకర్, నల్లగర్ల ప్రసాద్, ఏనుగంటి లక్ష్మయ్య స్పందించారు. తమ వంతుగా రూ.70 వేలతో వసతి గృహాలకు మెష్ ఏర్పాటు చేశారు. వసతి గృహ అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు.

24,25 తేదీల్లో స్పేస్ ఎగ్జిబిషన్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీహరికోట ఇస్రో సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో గుంటూరు చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 24, 25 తేదీలలో స్పేస్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు డీఈఓ పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో రాకెట్ నమూనాలు, శ్రీహరికోట నుంచి జరిగిన వివిధ ప్రయోగాలు, లాంచ్ ప్యాడ్ల ప్రదర్శనతో పాటు ఇస్రో, అకాడమియా, పరిశ్రమల నుంచి ప్రముఖ శాస్త్రవేత్తల ఉపన్యాసాలు నిర్వహిస్తారన్నారు. 25న ఉదయం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల ప్రాథమికోన్నత, ఉన్నత, హైస్కూల్ ప్లస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలో ఆసక్తి కలిగిన విద్యార్థులను గైడ్ టీచర్ల సహాయంతో ఎగ్జిబిషన్‌ను సందర్శించుటకు అనుమతించాలని కోరారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా(7842869407)ను సంప్రదించాలని అన్నారు.

సమాజ సేవలో జొన్న శ్రీనివాసరావు

విశాలాంధ్ర-తాడేపల్లి : ఉండవల్లిలోని చిన్న కాల్వ రోడ్ కొత్త కలువ నుంచి పీడబ్ల్యూడీ వర్క్ షాప్ రోడ్డు, నులకపేట నుంచి హరిజనవాడ రోడ్ ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఇబ్బందిగా మారింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కాల్వలో నుంచి, పొలాల్లో నుంచి పురుగు..పుట్రా రోడ్డు మీదకు వస్తుండడంతో రాత్రి సమయంలో... ఆ మార్గంలో రైతులు స్థానికులు భయపడుతూ నడుస్తున్నారు. యుద్ధప్రాతిపదికన స్పందించాల్సిన సమస్య కావడంతో... అధికారుల చర్యలు కోసం వేచి చూడకుండా... పరిష్కరించేందుకు జొన్న శ్రీనివాసరావు ముందుకు వచ్చి ఆ రోడ్‌లో సుమారు కిలోమీటర్ మేర ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు... ముళ్ల కంపలను సుమారు రూ.10 వేల వ్యయంతో జేసీబీ పెట్టి తొలగించారు. ఈ సందర్భంగా రైతులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అజిత్ పవార్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ నేషనల్ ప్రెసిడెంట్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ జన్మదిన వేడుకలను పేరేచర్ల డొంక మదీనా సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే బాజీ, ఎస్కే గన్ సైదా, షేక్ అలీల్, పీకే రావు, షేక్ మస్తాన్ వలి, జోసెఫ్, హరినారాయణ, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువలను సందర్శించిన సబ్ కలెక్టర్

విశాలాంధ్ర, తెనాలి : చినరావూరు మురుగు కాలువ, పెదరావూరు పెరవలి కాలువ, జంపని కాలువ, బుర్రిపాలెం కోయ కాలువ, పంట కాలువలను సోమవారం తెనాలి సబ్ కలెక్టర్ ప్రకర్ జైన్ సందర్శించారు. వారం రోజుల లోగా త్వరితగతిన పంటకాలువలలో పేరుకుపోయిన మురుగు, కలుపు మరియు అడ్డంకులను తొలగించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండల తాహసీల్దారు శ్రీనివాసరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ప్రేమ్‌సాగర్, మండల డ్రైనేజి అధికారి రాంబాబు, ఇతర ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది, రైతులు, ఆర్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ చించారని ఆందోళన

విశాలాంధ్ర-పెదనందిపాడు : మండల పరిధిలోని పాలపర్రు గ్రామంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఉన్న స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు బొమ్మను చించివేశారని తెలుగుదేశం కార్యకర్తలు సోమవారం పాలపర్రులో ఆందోళనకు దిగారు. పోలీసులు ఆందోళనకారులకు సర్దిచెప్పి ఆందోళనను విరమింపచేశారు.

'మెదడు'ను కాపాడుకుందాం..

- జీవితంలో ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తుంది
- సంవత్సరానికి 90 లక్షల మరణాలు
- మెదడు ఆరోగ్యంపై అవగాహన..



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మెదడు మానవ శరీరంలో అత్యంత అద్భుతమైన, ముఖ్యమైన అవయవం. మానవ మెదడు ఒకదానితో ఒకటి అనుసంధానించబడిన న్యూరాన్లు అని పిలువబడే 100 బిలియన్ కణాలను కలిగి ఉంటుంది. మిలియన్ల కొద్దీ విద్యుత్ తీగలతో ఆక్సాన్స్ అని పిలువబడే ఈ న్యూరాన్ల మధ్య 10 ట్రిలియన్ కనెక్షన్లు ఉన్నాయి. ఇవి మనకు చదవటానికి, రాయటానికి, ఆలోచించటానికి, చూడటానికి, తెలుసుకోవటానికి, అనుభూతి చెందటానికి సహాయపడతాయి. మెదడు మాట్లడటం, జ్ఞాపకశక్తి కదలిక, వ్యక్తిత్వం మొదలైన వాటితో సహ శరీరాన్ని నియంత్రిస్తుంది. మెదడు ఆరోగ్యం సరిగా లేకపోవడం మెదడు, శరీర పని తీరుకు భంగం కలిగిస్తుంది. ఇది వ్యక్తి జీవితంలోని ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తుంది. మెదడు ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం ఒక వ్యక్తి దీర్ఘకాలం, సంతృప్తికరమైన జీవితాన్ని గడపడటానికి సహాయపడుతుంది.

మన భారతదేశంలో సాధారణంగా వచ్చు న్యూరాలజికల్ జబ్బులు స్ట్రోక్ (42.2శాతం) మైగ్రేన్ (16.3), డిమెన్షియా (1.4), మెనింజైటీస్ (7.9), ఎపిలెప్సీ (6శాతం),పార్కిన్సన్ వ్యాధి, నియోనటల్ ఎన్సెపలోపతి, డయాబెటిక్ న్యూరోపతి, ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, నాడీ వ్యవస్థ క్యాన్సర్లు. ఆరోగ్యకరమైన జీవనశైలి మార్పులతో 90శాతం స్ట్రోక్‌లు, 40శాతం డిమెన్షియా కేసులు, 25శాతం ఎపిలెప్సీలను నివారించవచ్చు.

నివారణకు మార్గాలు..

+ సమతుల్య ఆహారం : వివిధ రకాల పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులతో కూడి ఆహారం తీసుకోవాలి
+ శారీరక శ్రమ : ప్రతి రోజు కనీసం 30 నిమిషాలు వారంలో 5 రోజులు పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల మెదడుకు రక్త ప్రసరణ పెరుగుతుంది. కొత్త మెదడు కణాల పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.
+ ఒత్తిడి జయించటం : దీర్ఘశ్వాస, ధ్యానం, యోగా వంటివి ఒత్తిడిని తగ్గిస్తాయి.
+ మెడికల్ హెల్త్ : మన రిస్క్ ఫ్యాక్టర్స్ సంఖ్యలను ఈవిధంగా తెలుసుకోవచ్చు. బీపీ-130/90 ఎంఎంహెచ్‌జీ ఉండేలా చూసుకోవాలి. పల్స్‌రేట్ సాధారణం లేదా క్రమరహితంగా ఉందో లేదో చెక్ చేసుకోవాలి. షుగర్ స్థాయిలను తనిఖీ చేయించుకుంటూ ఉండాలి (హెచ్‌బీఏ1సీని 7 కంటే తక్కువ ఉండేలా చూసుకోవాలి. 24.9 ఆరోగ్యకరమైన బరువు కలిగి ఉండాలి.
+ నిద్ర : ప్రతి రోజు కనీసం 7 గంటల నుంచి 9 గంటల వరకు నిద్ర పోవాలి.
+ సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా ఉండాలి. మీ కుటుంబ, స్నేహితులతో సన్నిహితంగా ఉండటానికి ప్రయత్నించాలి.
+ ధూమపానం మానివేయాలి. మద్యపానాన్ని పరిమితం చేయాలి. చదరంగం, పజిల్స్, సుడోకు వంటి బ్రెయిన్ గేమ్‌లు ఆడటం వల్ల బ్రెయిన్ డిజార్డర్స్ నివారించవచ్చు.

ప్రతి ముగ్గురిలో ఒకరికి నరాల సంబంధిత జబ్బులు..: డాక్టర్ విజయ, న్యూరాలజిస్ట్

మెదడు, నరాల జబ్బులు గురించి అవగాహన కల్పించేందుకు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ న్యూరాలజీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జులై 22న 'వరల్డ్ బ్రెయిన్ డే' జరుపుకుంటారు. 'బ్రెయిన్ హెల్త్ అండ్ ప్రివెన్షన్,'ప్రొటెక్టింగ్ అవర్ ఫ్యూచర్' అనేది ప్రపంచ మెదడు దినోత్సవం-2024 థీమ్. మెదడు ఆరోగ్యం, నివారణ గురించి అవగాహన కల్పించటమే దీని ప్రధాన ఉద్దేశం. డబ్ల్యూహెచ్ఓ గణాంకాల ప్రకారం ప్రతి ముగ్గురిలో ఒకరికి వారి జీవితకాలంలో నరాల సంబంధిత జబ్బులు రావచ్చు. ప్రపంచ వ్యాప్తంగా వైకల్యానికి నాడీ సంబంధిత జబ్బులే ప్రధాన కారణం. డిజాబిలిటీ అడ్జెస్టడ్ లైఫ్ ఇయర్స్ (డీఏఎల్‌వైలు)18శాతం పెరిగాయి. సంవత్సరానికి 90 లక్షల మరణాలు (మరణానికి 2వ ప్రధాన కారణం)సంభవిస్తున్నాయని తెలిపింది. 80శాతం పైగా నాడీ సంబంధిత మరణాలు, వైకల్యాలు న్యూరో స్పెషలిస్ట్‌ల సంరక్షణ మరియూ వనరులు తక్కువగా ఉన్న దిగువ మధ్య తరగతి దేశాలలో సంభవిస్తున్నాయి. కానీ అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రతి 10 లక్షల మంది ప్రజలకు ఒక న్యూరాలజిస్ట్, ప్రతి కోటి మందికి ముగ్గురు న్యూరో సర్జన్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు.

ఎత్తైన సీసీ రోడ్డుతో ఇబ్బందులు

విశాలాంధ్ర-మంగళగిరి : నగరంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయానికి వెళ్లే దారిలో కొత్తపేట వెళ్లేందుకు మలుపు వద్ద ఎత్తుగా సీసీ రోడ్డు ఉండటం వలన వాహన దారులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. సీసీ రోడ్డు ఎత్తుగా ఉండటం అక్కడే దేవస్థానం వారు రోడ్డుపై ఏర్పాటు చేసిన ఐరన్ రాడ్లు అడ్డంగా ఉండటంతో కొత్తపేట వెళ్లేందుకు మలుపు రోడ్డు ఎత్తుగా ఉండటం వలన ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు క్రిందపడి గాయాలపాలవుతున్నారు. ఇక్కడే స్పీడ్ బ్రేకర్లు ఉండటం వాహనాలు వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. నగరపాలక అధికారులు దేవాలయంకు వెళ్లే దారిలో ఉన్న ఇనుపరాడ్‌లను తొలగించి, ఎత్తులో ఉన్న సీసీ రోడ్డుకు సమానంగా రోడ్డు కూడా అదే ఎత్తులో వేయాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

CHANGE OF NAME

I, **ANJURI POORNA VIJAYA LAKSHMI** (Old Name), W/o. **ANJURI RAM MOHAN RAO**, Resident of Door No.32-30-1786, Vasantharaya Puram, 3rd Line, Opp: Omkar Kshetram, Guntur - 522002, Guntur District, Andhra Pradesh. I have changed my name as **ANJURI PURNA VIJAYA LAKSHMI** (New Name) W/o. **ANJURI RAM MOHAN RAO.** Hereafter my name is known as **ANJURI PURNA VIJAYA LAKSHMI** (New Name) W/o. **ANJURI RAM MOHAN RAO.**

CHANGE OF NAME

I, **ANJURI RAMAMOHANA RAO** (Old Name), S/o. **ANJURI KRISHNAMURTHY**, Resident of Door No.32-30-1786, Vasantharaya Puram, 3rd Line, Opp: Omkar Kshetram, Guntur - 522002, Guntur District, Andhra Pradesh. I have changed my name as **ANJURI RAM MOHAN RAO** (New Name) S/o. **ANJURI KRISHNAMURTHY**. Hereafter my name is known as **ANJURI RAM MOHAN RAO** (New Name) S/o. **ANJURI KRISHNAMURTHY.**

HINDUJA HOUSING FINANCE

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, లిటిల్ మౌంట్, సైదాపేట్, చెన్నై-600 015, బ్రాంచ్ ఆఫీస్: 2వ అంతస్తు, బి-19 టవర్స్, కర్బాలా మైదాన్, రాణిగంజ్, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500003

అనుబంధం-4
స్వాధీనత ప్రకటన
(స్థిర ఆస్తి కొరకు)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్‌హెచ్ఎఫ్ఎల్) అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసులో ప్రస్తావించిన బకాయి మొత్తాన్ని సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసిందిగా కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు పిలుపు నిస్తూ అధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణగ్రహీత బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13 లోని ఉప సెక్షన్ (4) కింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తులను దిగువ సంతకందారు స్వాధీనం చేసుకున్నట్లు రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది. హామీ పెట్టబడిన ఆస్తిని విడిపించు కోడానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క ఉపసెక్షన్ (8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలను కోరడమైనది. ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని, ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు ఈ కింద పేర్కొన్న బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీకి గాను హెచ్‌హెచ్ఎఫ్ఎల్ చార్జికి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

వ. సం.	రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు	డిమాండ్ నోటీసు తేదీ & బాకీ మొత్తం	స్వాధీనత తేదీ
1	1. శ్రీ వసీం మహమ్మద్ అబ్దుల్,....రుణగ్రహీత, 2. శ్రీమతి నస్రీన్ బేగం....సహ-రుణగ్రహీత ఇద్దరూ నివసించునది: హెచ్.నం.11-3-354/13, పాటిగడ్డ, పార్శీగుట్ట, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500061. లోన్ అకౌంట్ నం. : AP/HDR/HYDR/A000000409 & AP/HDB/ECIL/A000000093 & CO/CPC/CPOF/A000001804	19/02/2024 & రూ.41,43,821/- (నలభై ఒక్క లక్షల నలభైమూడు వేల ఎనిమిది వందల ఇరవై ఒక్క రూపాయలు మాత్రమే)	17.07.2024

హామీగా పెట్టిన ఆస్తి (స్థిర ఆస్తి) వివరాలు : గుంటూరు జిల్లా, గుంటూరు సబ్ జిల్లా, ప్రస్తుతం కొరిటెపాడు సబ్ జిల్లా. గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా పరిధి, ఇది టౌన్ సర్వే కాని గోరంట్ల గ్రామ డి.నం.476, ఏసి10-06 సెంట్లు, ఇందులో ప్లాన్ ద్వారా ప్లాట్లుగా ఏసి1-50 సెంట్లు నందు ప్లాట్ నం.ఎ-727 ఆధారంగా ఉన్న 200 చదరపు గజాల విస్తీర్ణపు స్థలం. సరిహద్దులు ఈ కిందివిధంగా. హద్దులు: తూర్పు: డి.నం.497కు చెందిన స్థలం-33'-4", పడమర: 33 అ॥ల వెడల్పు రోడ్డు-33'-4", ఉత్తరం: ప్లాట్ నం.ఎ728 యొక్క స్థలం-54'-0", దక్షిణం: ప్లాట్ నం.ఎ-726 యొక్క స్థలం-54'-0".

ప్రదేశము : గుంటూరు, తేదీ : 23.07.2024 సం/- హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన విశాఖపట్నం జిల్లా, పెందుర్తి పోస్ట్, జుత్తాడ గ్రామం, అంబేద్కర్ నగర్, డోరు నెం.2-81రు కాపురస్తులు (లేటు) పేకేటి పాలయ్య గారి కుమారుడు పేకేటి కృష్ణమూర్తి (సెల్: 7981041174) గారి నంజాయిషీ పొంది యావన్మందికీ తెలియజేయునది.

నా క్లయింటు పేరిట గుంటూరు డి, నల్లపాడు సబ్‌డి, వెంగళాయపాలెం, అంకిరెడ్డిపాలెం గ్రామ పంచాయితీ సర్వే నెం.1241 ఎ, 1241 బి,1242 ఎ,1242 బి,1243,1244, 1245, 1246 ఎ,1246 బి, 1247 బి, 1248, ప్లాటు నెం.185రు నందలి 300 చదరపు గజముల స్థలము కలదు. సదరాస్తి ఆయన పేరిటకు ది.02-11-1988న ది ప్రాజెక్ట్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ రిజిష్టరు నెంబర్ 1-2743 వారి నుండి విక్రయ దస్తావేజు నెం.4912/1988 రుగా గుంటూరు జిల్లా రిజిస్ట్రారు ఆఫీసులో రిజిష్టరు కాబడినది.

కాగా, ది.12-07-2024న స్థలము విక్రయ నిమిత్తం నా క్లయింటు గుంటూరుకు వచ్చారు. అనంతరం గుంటూరు సబ్ రిజిస్ట్రారు ఆఫీసు వద్ద డాక్యుమెంటు రైటరును కలిసి పైన పేర్కొన్న దస్తావేజు జిరాక్సు కాపీ అవసరం కాగా జిల్లా కోర్టు రోడ్డులోని ఫొటోస్టాట్ సెంటర్‌కు టూవీలర్‌పై వెళ్లుచుండగా ఒరిజినల్ దస్తావేజు గల కవరు మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. సదరాస్తికి హద్దులు: తూర్పు:40 ఫీట్ రోడ్డు, దక్షిణం: 184 ప్లాటు, పడమర: 196 ప్లాటు, ఉత్తరం: 186 ప్లాటు. ఈ హద్దుల మధ్య 300 చదరపు గజముల ఖాళీ నివాస స్థలము.

సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ తెలియజేసిన యెడల తగిన పారితోషికము అందజేయబడును. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన ప్రచురితమైన తేది నుండి వారం రోజులలోగా తెలియజేయగలరు. తదుపరి క్లయిములు నా క్లయింటును బైండు చేయజాలవు. పోయిన దస్తావేజు విషయమై నా క్లయింటు చేత పోలీసులకు ఫిర్యాదు చేయడం ద్వారా చట్టవరమైన చర్యలు వెంటనే తీసుకొనుచున్నాము.

నోట్: పై విషయమై ఇప్పటికే ది. 22-07-2024న సాక్షి గుంటూరు తూర్పు ఎడిషన్ నందు ప్రకటన ప్రచురితమైనప్పటికీ అందులో సర్వే నెంబరు, రిజిష్టరు జరిగిన ఆఫీసు పేరు తప్పులుగా నమోదు అయినందున మరలా సవరణ చేసి పై బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది గమనించగలరు.

ఇట్లు: విజయ్ రాజ్ కుమార్.బి (బీఆర్కే) న్యాయవాది, కోర్టు రోడ్డు, గుంటూరు సెల్: 83098 50241

నాగార్జున శిల్ప కళాశాలను ఎస్పీ సందర్శన

విశాలాంధ్ర-దుర్గి : నూతనంగా పల్నాడు జిల్లా ఎస్పీగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసరావు ఆదివారం పల్నాడు ప్రాంతంలోని రెంటచింతల, మాచర్ల, వెల్దుర్తి, దుర్గి మండలాల్లో సుడిగాలి పర్యటన గావించారు. ప్రతి పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. అక్కడి పరిస్థితులను గమనించారు. అనంతరం దుర్గిలో శిల్పకళలకు ప్రసిద్ధి గాంచిన నాగార్జున శిల్ప కళాశాలను సాయంత్రం సందర్శించారు. కళాశాలలో కళాకారులు చెక్కిన శిల్పాలను తిలకించారు. శిల్పులలో ఇమిడి ఉన్న సృజనాత్మక శక్తిని, నైపుణ్యాలను వర్ణించలేమన్నారు. ప్రపంచవ్యాప్తంగా శిల్ప కళలకు మంచి గుర్తింపు తెచ్చుకున్న కళాశాల నిర్వాహకులు చెన్నుపాటి శ్రీనివాసాచారిని, శిల్పులను ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

సంగం పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని ఓబులేశునిపల్లె గ్రామ పాల ఉత్పత్తి కేంద్రంలో 239 మంది పాల ఉత్పత్తిదారులకు సోమవారం సంగం డెయిరీ ఆధ్వర్యంలో రూ.5,71,702 బోనస్ పంపిణీ చేశారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పాల ఉత్పత్తి కేంద్రాలు ఎంతో దోహదపడతాయని సంగం డెయిరీ డైరెక్టర్ పులుకూరి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలో ఓబులేశునిపల్లె, ధర్మవరం, దుర్గి గ్రామాలు ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగం డెయిరీ మేనేజర్ ఉప్పలపాటి రంగారావు, రూట్ సూపర్‌వైజర్ బద్దులు హనుమంతరావు, ఓబులేశుని పల్లెపాల ఉత్పత్తి కేంద్రం అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు, జి.సత్యన్నారాయణ, వసంత ఆంజనేయులు, పంగులూరి పూర్ణచంద్రరావు, వట్టికొండ వెంకటేశ్వర్లు, రైతులు చింతల సైదయ్య రెడ్డి, సాయిన్న, బట్టి అనసూర్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లుతున్న తహశీల్దార్‌కు సన్మానం

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఎన్నికల విధులు ముగించుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీపై వెళ్తున్న పెదకూరపాడు మండల తహశీల్దార్ జీవిగుంట ప్రభాకర్‌ను ఆర్వో కందుల శ్రీరాములు, డిప్యూటీ తహశీల్దార్ నిర్మల కృష్ణ, ఎంపీడీవో మల్లేశ్వరి, వీఆర్వోలు, ఆఫీస్ సిబ్బంది, వీఆర్‌ఏలు, ఉపాధ్యాయులు, పాత్రికేయ మిత్రులు, సోమవారం ఘనంగా సన్మానించారు అనంతరం ఆర్వో కందుల శ్రీరాములు మాట్లాడుతూ ప్రభాకర్ వివిధ జిల్లాలలో ఎన్నికల సమయంలో తహశీల్దార్‌గా విధుల్లో నిర్వహించి అందరూ మన్ననలు పొందారని, ఆయన సేవలు మరువలేమని పలువురు ప్రసంగించారు.

వ్యవసాయ గణన సర్వేపై అవగాహన

విశాలాంధ్ర-దుర్గి : వ్యవసాయ గణనన(భూ కమతాలు సర్వే) సర్వేకు గ్రామ రెవిన్యూ అధికారులు సిద్ధంగా ఉండాలని తహశీల్దార్ జి.రజని కుమారి అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వ్యవసాయ గణనన సర్వేపై వీఆర్వోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఓ ప్రభాకర్ మాట్లాడుతూ భూ కమతాల సర్వే 10 సంవత్సరాలకు ఒక్కసారి జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా మండలంలో అన్ని గ్రామాల్లో ఆగస్టు నెల నుంచి క్షేత్రస్థాయిలో ఓసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించి పొలం విస్తీర్ణం గుర్తించి, ఏ పంట వేశారు, ఆ పంటలకు ఒక ఎకరాకు ఎంత ఖర్చు వస్తుంది, పంట దిగుబడి ఎంత వస్తుంది, ఆ పంట ద్వారా ఎంత ఆదాయం వస్తుంది తెలుసుకుని ఆయా పంటలకు మద్దతు ధర నిర్ణయించేందుకు ఈ సర్వే చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు టి.కోటేశ్వరరావు, కిరణ్, రత్నప్రకాష్, గంగమ్మ, జానీభాష, రాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ నీడ కూడా రాష్ట్రానికి అరిష్టమే : ఆళ్ళ

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: అధికారాన్ని అడ్డం పెట్టుకొని హత్యలు, దోపిడీలు, దౌర్జన్యాలు, దాష్టీకాలతో రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు నిర్విరామంగా దోచుకున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి నీడ కూడా రాష్ట్రానికి అరిష్టమేనని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. సోమవారం సేవ్ డెమోక్రసి అంటూ జగన్ రెడ్డి అసెంబ్లీ ఎదుట ప్లా కార్డులతో నిరసనకు దిగటంపై ఆయన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసనలు, ఆందోళనలు చేసే హక్కు ప్రతీ ఒక్కరికీ ఉంటుందన్నారు. అయితే అవి బెదిరింపులతోనూ, విధుల్లో ఉన్న అధికారుల దూషణలతోనూ సాగకోడదన్నారు. జగన్ రెడ్డికి అసెంబ్లీ నియమ నిబంధనలు తెలియవా అంటూ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడమంటూ జగన్ రెడ్డి అంటుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవకు రాజకీయ రంగు పులిమి రాష్ట్రంలో విద్వేషాలు రెచ్చకొట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. సయ్యద్ షర్ఫుద్దీన్, గద్దం రోశయ్య, సయ్యద్ చాంద్, ఫణి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



విశాలాంధ్ర-గుంటూరు సిటీ: స్థానిక నవభారత్ నగర్ నాలుగో లైన్‌లో సీసీ రోడ్లు, డ్రైయిన్లు, వికాస్ నగర్ ఒకటో లైన్‌లో రోడ్లు, డ్రైయిన్లను ఎమ్మెల్యే గళ్ళా మాధవి సోమవారం ప్రారంభించారు. అదేవిధంగా నవభారత్ నగర్ ఒకటో లైన్ 2వ అడ్డ రోడ్డులో సిసి రోడ్లుకు 22 లక్షల రూపాయల అంచనాలతో పనులకు ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ (బుజ్జి)తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా నవభారత్ నగర్‌లో రోడ్లు, డ్రైయిన్లు కూడా అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమని, అభివృద్ధిని గత ప్రభుత్వం మరిచినట్లు ఉందని ఎద్దేవా చేశారు. వారం రోజులలో అధికారులు మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కనపర్తి శ్రీనివాసరావు, కిరణ్ కుమార్ రెడ్డి, రాధాకృష్ణ, శ్రీనివాస్, బోసు, తిలక్, పున్నయ్య చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

హత్యలు, అఘాయిత్యాలు ఇప్పుడు కనపడుతున్నాయా జగన్: సుభాని

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: వైసీపీ ప్రభుత్వం 2019లో అధికారంలోకి వచ్చిన నాటి నుండి అధికారం పోయే వరకు రాష్ట్రంలో జరిగినన్ని అఘాయిత్యాలు, హత్యలు, కబ్జాలు మునుపెన్నడూ జరగలేదని ఆ నాడు కనపడనివి నేడు మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కళ్ళకు కనపడడం వాటి మీద స్పందించడం, పరామర్శించడం, ధర్నాలు చేయడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షులు షేక్ సుభాని అన్నారు. స్థానిక బ్రాడిపేటలోని ముస్లిం సేన రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సుభాని మాట్లాడుతూ వినుకొండలో జరిగిన హత్య ఇరువురు స్నేహితుల మధ్య జరిగిన వ్యక్తిగత గొడవల వలన జరిగితే దానిని జగన్ రెడ్డి శవ రాజకీయం చేశారని ఎద్దేవా చేశారు. వైసీపీలో జిల్లా వక్ఫ్ కమిటీ జాయింట్ సెక్రటరీగా కొనసాగుతున్నప్పుడు నాపై జరిగిన దాడిని సాక్ష్యాలతో సహా ఫిర్యాదు చేసిన, కేవలం దాడి చేసిన వ్యక్తులపై నామ మాత్రపు కేసులు పెట్టి వారిపై చర్యలు కూడా తీసుకోలేదన్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో అధ్వానంగా రోడ్లు

బాలాజీ

విశాలాంధ్ర-చిలకలూరిపేట : రాష్ట్ర ప్రగతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచే రోడ్లు వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని, రాష్ట్ర రోడ్ల దుస్థితిపై ప్రజలు, విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నా నాటి ప్రభుత్వం పట్టించుకున్న పాపన పోలేదని జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ బాలాజి ఆరోపించారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రోడ్లపై అడుగుకొక గుంత ఆపైన భారీ గొయ్యిలు, గోతుల మధ్య రహదారి ఎక్కడ ఉందో వెతుక్కుని వాహనాలు నడపాల్సి వచ్చిందని వెల్లడించారు. గ్రామీణ రహదారులను గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో వాటిలో గుంతలు పూడ్చడానికే ప్రస్తుతం రూ.1,121.85 కోట్లు అవసరమవుతాయని ఇంజినీర్లు అంచనాలు వేశారని పేర్కొన్నారు. రోడ్లపై గోతులు పూడ్చి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలన్న ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆదేశాలపై ఇంజినీర్లు అంచనాలు వేశారని, దాదాపుగా 3 వేల కిలో మీటర్ల పొడవైన 1,548 రహదారుల పనులకు రూ.863 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారని వెల్లడించారు. దీన్ని బట్టి ఒక్క గ్రామీణ రహదారుల దుస్థితే ఇంత అధ్వాన్నంగా ఉంటే.. ఇతర రహదారుల పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. ఏళ్ల తరబడి నిర్వహణ లేక కొన్ని గ్రామాల్లో రోడ్లు కనుమరుగయ్యాయని, కొన్ని గ్రామాల్లో లింక్‌రోడ్లు తారు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయాయని ఆరోపించారు. దీంతో కొన్ని వందల గ్రామాలకు బస్సులు నడపలేక సర్వీసులను నిలిపేశారని, ఆ గ్రామాలకు ఆటోల్లోనే ప్రయాణం సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్రంలో రోడ్లను మరమత్తులు చేయాలని మొదటిసారిగా ఉద్యమ రూపంలో పోరాటం చేసింది జనసేన పార్టీయేనని, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు రాష్ట్రంలో మరమత్తులకు గురైన ప్రతి రోడ్డు వద్ద ఆందోళనలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు.

మంచినీటి చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పట్టణ శివారులోని పాత మంచినీటి చెరువులో సుగాలి కాలనీకి చెందిన హనుమా నాయక్ అనే వ్యక్తి ఈ నెల 17వ తేదీ మృత్యువాత పడిన సంగతి విదితమే. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావుకు ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు మంచినీటి చెరువులకు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఇదే విధంగా జరిగిందని, ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని విఫలం అయ్యారని అన్నారు. ఈ ప్రభుత్వంలో అయిన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలన్నారు. మునుముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా తక్షణమే చర్యలు తీసుకోవడంతో పాటు చెరువుల వద్ద భద్రత ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి త్వరలోనే తీసుకెళ్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్, ప్రధాన కార్యదర్శి కుంభా నాగేశ్వరరావు, పట్టణ గౌరవ అధ్యక్షులు బి.చిన్న నాయక్, అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు, కోశాధికారి బి.రాంబాబు నాయక్, నాయకులు ఎం.వెంకటేష్ నాయక్, ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు సలికినిడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బోధనా పరికరాల ప్రదర్శన

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం(2020) అమలు చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జూలై 22 నుంచి 28 వరకు 'శిక్షాసప్తాహ్' కార్యక్రమం నిర్వహిస్తుంది. అందులో భాగంగా ఈ సోమవారం స్థానికంగా లభించే వనరులను ఉపయోగించుకొని బోధనోపకరనాల తయారీ ప్రదర్శన చేయాలి. చిలకలూరిపేట పట్టణంలో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన బోధనోపకారణాలను ప్రదర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కె.సుధ మాట్లాడుతూ బోధనోపకరనాల తయారీలో విద్యార్థులు పాల్గొనటం వల్ల వారిలో సృజనాత్మకత పెంపొందుతుందని అన్నారు. ఈ విధానం వల్ల బోధనలో విద్యార్థులకి సులభంగా అర్థమయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రదర్శన వల్ల విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, ఏ.నీలిమ, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శవ రాజకీయాలు మానుకో జగన్..

విశాలాంధ్ర-శావల్యాపురం : వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇకనైనా శవ రాజకీయాలు మానుకోవాలని రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రమైన శావల్యాపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ వినుకొండలో ఇటీవల జరిగిన వ్యక్తిగత హత్యను రాజకీయ హత్యగా గావించి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులపై రుద్దడం జగన్‌మోహన్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని, ప్రతిపక్ష హోదా కూడా లేకుండా 11 సీట్లు ఇచ్చి రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పిన ఇంకా అవాస్తవాలను వాస్తవాలుగా చిత్రీకరించడం ఒక్క జగన్‌మోహన్ రెడ్డికే చెల్లుతుందన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు బలైన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను పరామర్శించడానికి వెళ్తున్న అప్పటి ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబును అడుగడుగున ఆంక్షలు పెట్టి అడ్డుకోలేదా అని ప్రశ్నించారు. ఇప్పుడు మీరు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవాచేశారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.దారునాయక్ అన్నారు. మాచర్ల మండలం అచ్చమ్మకుంట తండాలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దారునాయక్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, పరిసరాల సుందరీకరణ మొక్కలను నాటి సంరక్షించడం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో చెట్లు నరకడమే పనిగా వైసీపీ నేతలు పెట్టుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, దేవలా నాయక్, లక్ష్మయ్య, భగత్, దుర్గయ్య, రామ్ సింగ్, జీవుల నాయక్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రావి సాంబయ్య హైస్కూలులో ఎన్‌సీసీ ఎంపికలు

విశాలాంధ్ర, తెనాలి : రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూలులో ఫస్ట్‌యియర్ ఎన్‌సిసి సెలక్షన్స్ సోమవారం జరిగాయి. 22 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ మహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్‌లో భాగంగా హైట్, వెయిట్, రన్నింగ్ మరియు ఇంటర్వ్యూ నిర్వహించి సెలక్షన్‌కు వచ్చిన 120 మంది విద్యార్థులలో 80 మంది విద్యార్థులను సెలెక్ట్ చేశారు. ఈ సందర్భంగా కమాండింగ్ ఆఫీసర్ మాట్లాడుతూ, ఎన్‌సిసిలో జాయిన్ అయిన ప్రతి ఒక్కరూ ఒక క్యాంపును పూర్తి చేసుకోవాలని, క్రమశిక్షణతో మెలగాలని పేర్కొన్నారు. ఎన్‌సిసి రెండు సంవత్సరాల కాలంలో విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, దేశభక్తి అలవాటు అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్ మౌలాలి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో డీఆర్వో దంపతులు

విశాలాంధ్ర-దుర్గి: మండల పరిధిలోని నిదానంపాడులో వేంచేసియున్న మహాశక్తి పీఠం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అడిగొప్పల శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారిని పల్నాడు జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ప్రత్యేక పూజా చేసి ఆశీర్వచనాలు అందజేశారు. దేవస్థానంలో జరుగుతున్న చండీహెూమంలో డీఆర్‌ఓ దంపతులు పాల్గొన్నారు. అనంతరం వారిని దేవస్థానం అధికారులు శేషవస్త్రాలతో సన్మానించి, తీర్థప్రసాదాలను అందజేశారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

విశాలాంధ్ర-పెదకూరపాడు: మండల కేంద్రంలోని కామినేని వారి చెరువు సమీపంలో ప్రధాన రహదారి వెంబడి విద్యుత్ హై టెన్షన్ లైన్ స్తంభం నేల కొరిగి ప్రమాదభరితంగా ఉందని రైతులు తెలిపారు. అందులో విద్యుత్ సరఫరా ఉంటే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యుత్ సిబ్బంది తక్షణమే స్పందించి ఒరిగిపోయి పూర్తిగా నేలమట్టమైన స్తంభాన్ని పునరుద్ధరించాలని రైతులు కోరారు. ఎలాంటి ప్రమాదం లేకుండా విద్యుత్ సిబ్బంది తక్షణమే మేలుకోవాలని రైతులు కోరారు.

చెరువును పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర-సత్తెనపల్లి: గార్లపాడు రోడ్డులోని మంచినీటి చెరువును సోమవారం మునిసి పల్ కమిషనర్ షమ్మి సందర్శించారు. సాగర్ జలాలు విడుదల అవుతున్న నేపథ్యంలో గార్లపాడు రోడ్‌లో ఉన్న రక్షిత మంచినీటి చెరువుకు సాగర్ జలాలను, నీటి మళ్లింపు దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి, ఆ శాఖ ఇంజనీరింగ్ అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెరువుకు నీటి మళ్లింపు విషయంలో ఎక్కడా కూడా సిబ్బంది నిర్లక్ష ధోరణి వహించరాదని ఎప్పటి కప్పుడు తగిన సమాచార మందించాలన్నారు. త్రాగునీటి విషయంలో ప్రజలు కాచి, చల్లార్చిన మంచినీటిని త్రాగాలన్నారు. అంతేకాకుండా 450 హెచ్పీ విద్యుత్ మోటార్ల పైపుల ద్వారా మంచినీటిని చెరువుకు నింపేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. డీఈ మధుసూదనరావు, ఏఈ సాగర్, సిబ్బంది కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

విశాలాంధ్ర-సత్తెనపల్లి: సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్తెనపల్లిలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్, న్యాయవాదులు దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్ లు మాట్లాడారు. ఈ నేపథ్యంలో బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాదులు కోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాటిబండ్ల రవి, న్యాయవాదులు బత్తుల ఆదినారాయణ, సయ్యద్ అబ్దుల్ రహీమ్, కళ్ళం వీరభాస్కర్ రెడ్డి, రాజవరపు నరసింహారావు, బి.ఎల్. కోటేశ్వరరావు, జూపల్లి శేషయ్య, చవల బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ దిమ్మె విధ్వంసం దుర్మార్గం

విశాలాంధ్ర-మాచర్ల : ఎన్టీఆర్ దిమ్మెను వైసీపీ మూకలు ధ్వంసానికి పాల్పడడం దుర్మార్గమని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జున రావు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాల ద్వారా బాధ్యులను గుర్తించి పోలీసులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని 24వ వార్డు పోలేరమ్మ టెంపుల్ ఎదురు పగలగొట్టిన ఎన్టీఆర్ దిమ్మెను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ నాటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఐదేళ్ల పాలన దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలతో సాగిందన్నారు. అభివృద్ధి సంక్షేమానికి పట్టం కట్టాల్సిన జగన్ కక్షపూరిత రాజకీయాలు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. నేటి సీఎం చంద్రబాబు నెల రోజుల పాలనలో పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు క్యూ కడుతున్నారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని మాచర్లలో వైసీపీ నాయకులు గతంలో ఎన్టీఆర్ విగ్రహాలు విధ్వంసానికి పాల్పడిన సంగతి ప్రజలందరికీ తెలుసన్నారు. మాచర్ల నియోజకవర్గంలో పగలగొట్టడం, తగులపెట్టడం తప్ప అభివృద్ధి ఎక్కడ జరిగిందో వైసీపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. వైసీపీ మాదిరిగా టీడీపీ నాయకులు కూడా కక్షపూరితంగా వ్యవహరిస్తే పరిస్థితి మరోలా ఉంటుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో వీరూ, తిక్క కొండలు, ప్రసాద్, బొట్టు కోటేశ్వరరావు, షేక్ మస్తాన్, గాజుల అంజి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అధీనంలో వినుకొండ ఆర్టీసీ బస్టాండ్

విశాలాంధ్ర-వినుకొండ: ఆర్టీసీ బస్టాండ్ రాత్రులందు పూర్తిగా రౌడీ, గంజాయి ముఠా, ఆధీనంలోకి వెళ్ళిపోతున్నదని, పట్టణ ప్రజలతోపాటు, డిపో కింద సాయి సిబ్బంది చెప్పకనే చెబుతున్నారు. అధికారులకు తెలిసినప్పటికీ ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్టాండ్‌కు ప్రతిరోజు వందల సంఖ్యలో ఇతర డిపో బస్సులు రాత్రులందు వచ్చి వెళుతుంటాయి. రాత్రి 10 దాటగానే రౌడీ గంజాయి ముఠా నలుగురు నుంచి ఆరుగురు వరకు. బస్టాండ్లో ప్రవేశిస్తారు. వీరిలో ఇరువురు బస్టాండ్లోకి ప్రవేశిస్తారు. రాత్రి లాస్ట్ బస్సులు అందక బస్టాండ్లో బెంచీలపై పడుకున్న ప్రయాణికుల వద్దకు వెళ్లి వారిని లేపి బెదిరించి డబ్బు దోచుకుంటారు. ఆ క్రమంలో ఏదన్నా గొడవ జరిగితే మిగతా నలుగురు ముఠా కూడా ప్రవేశించి ప్రయాణికులను బెదిరిస్తారు. ఇక బస్టాండ్‌లో ఉన్న బంకుల్లో సిగరెట్లు, పాన్ పరాగులు జరుగుతుంటాయి. ఈ గంజాయి ముఠా అక్కడికి వెళ్లి తాపీగా మద్యం కూడా సేవించి. సంఘ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తుంటారు. ఈ రాత్రి సమయాల్లో స్థానిక పోలీసులు గాని, ఆర్టీసీ డిపో సెక్యూరిటీ గార్డులు గాని బస్టాండ్ లోకి పెద్దగా రారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో ఈ రౌడీ గంజాయి బ్యాచి. తమ కార్యకలాపాలను కొనసాగిస్తుంటారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. రాత్రి సమయాలలో గ్యారేజీలో పనిచేసే కార్మికులు టీ కోసం బయటకు వస్తుంటారు. ఈ రౌడీ గంజాయి గ్యాంగ్, కార్మికుల కళ్ళలో పడ్డప్పటికీ అధికారుల నిస్సహాయ స్థితికి కార్మికులు నోరెత్తలేకపోతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు, స్థానిక పోలీస్ యంత్రాంగం సమన్వయంతో రాత్రులందు బస్టాండ్లో పోలీసు గస్తీ మరింత పెంచి ఈ రౌడీ గంజాయి ముఠా నుండి బస్టాండ్‌కు విముక్తి కలిగించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ప్రధాన రోడ్లన్నీ గోతులమయం

విశాలాంధ్ర-వినుకొండ: పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ గుంతలు పడి వాహనదారులు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గోతులు పడి నెలలు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు పడుతున్న కారణంగా ఆ గోతుల్లో నీరు చేరి గోతులెక్కడున్నాయో కనబడక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల గురై గాయాల పాలవుతున్నారు. ప్రధానంగా శివయ్య స్తూపం సెంటర్, ఆర్టీసీ రోడ్, ఏనుగుపాలెం రోడ్డు అలాగే ఆర్ అండ్ బి రోడ్డు ఆయా వీధుల్లోకి వెళ్లే సిమెంట్ రోడ్ల వద్ద పెద్ద గోతులు పడి మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతుంది. ఆ ప్రాంతాలలోనే టిఫిన్ బండ్లు పెట్టి వ్యాపారాలు కొనసాగిస్తున్నా మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్లన్నీ గోతులు పడ్డాయి అంటూ. అప్పటి ప్రతిపక్ష పార్టీలు తమ కార్యకర్తలతో వెళ్లి ఆయా గోతుల్లో వరి నాట్లు వేసి అప్పటి వైసిపి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మరి ప్రభుత్వం మారి రెండు మాసాలు కావస్తున్నా అధికారులు అ గోతుల్లో తట్ట మట్టివేసి పూడ్చిన పాపాన పోలేదు. సత్వరం పట్టణంలో ప్రధాన రోడ్లన్నీ గుంతలు పూడ్చివేసి ప్రమాదాలు నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఆర్టీసీ బస్టాండ్

విశాలాంధ్ర-వినుకొండ: ఆర్టీసీ ప్రధాన ద్వారం వద్ద పెద్ద పెద్ద గోతులు పడి బస్టాండ్ లోకి వచ్చి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ లోకి వచ్చి వెళ్ళే సమయంలో బస్సులు వస్తునప్పుడు బురదంత ప్రయాణికుల దుస్తులపై పడి ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్లోకి వెళ్లాలన్న బయటకు రావాలన్న బురద గోతులు తప్పించుకొని ప్రయాణికులు పక్కనుంచి నడుస్తున్నారు. అధికారులు ఈ దృశ్యాలను చూస్తున్నా పట్టీ పట్టనట్లు ఉంటున్నారు. ఉన్నతాధికారులు మందలించినప్పుడు తూతూ మంత్రంగా మట్టితో ఆ గోతులు పూడుస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్టాండు ప్రధాన గేట్ల వద్ద గోతులు పడకుండా శాశ్వతంగా తారుతో రోడ్డు వేసి. ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని వినుకొండ ప్రజలు కోరుతున్నారు.

బస్సులకు మరమ్మతులు కరవు

విశాలాంధ్ర-వినుకొండ: ఆర్టీసీ డిపోలో బస్సులు మరమ్మతులు చేయించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. కనీసం కండక్టర్ కూర్చునే సీట్ కూడా విరిగినా రిపేరు చేయించుకోలేని దౌర్భాగ్య స్థితిలో స్థానిక ఆర్టీసీ డిపో ఉంది. ఇటీవల బ్రేకులు కూడా సక్రమంగా పడటం లేదంటూ పలువురు డ్రైవర్లు ఉన్నతాధికారులు వినుకొండ వచ్చినప్పుడు వారి దృష్టికి తీసుకు వెళ్లారు. కాగా ఆదివారం మధ్యాహ్నం ఏపీ 26 జెడ్ 0170 నంబరు పల్లె వెలుగు బస్సు నరసరావుపేట పంపారు. అయితే బస్సు లేడీ కండక్టర్ తన సీటులో కూర్చొని టికెట్లు కొట్టకుండా వెనుక టూ, సీటర్ మొత్తం ఆక్రమించి టికెట్లు కొడుతుంది. ప్రయాణికులు మీ సీటు ఏమైందని అడగ్గా బస్సు ఇచ్చినప్పుడే నా సీటు విరిగిపోయి ఉంది అందువల్ల వెనక సీట్లో కూర్చుని టికెట్లు కొడుతున్నానంటూ సమాధానం ఇచ్చింది. ఇది వినుకొండ ఆర్టిసి డిపో దుస్థితి అంటూ ప్రయాణికులు పెదవి విరిచారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ

విశాలాంధ్ర - కారంపూడి : ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ నందు మధ్యాహ్న భోజనానికి విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో 200 మంది పిల్లలకు భోజనం ప్లేట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టి.రవికుమార్ హెచ్ఎం ఎం.విజయ లలిత, శెట్టి హనుమంతరావు, భవిరిశెట్టి రామారావు, గుండా ఉమామహేశ్వరరావు, కజ్జం ఆంజనేయులు, గణితి అమరయ్య, ముచ్చర్ల రామ కోటేశ్వరరావు, కరాలపాటి. ఆదినారాయణ, చిట్టిప్రోలు నరసింహారావు, పావులూరి కోటేశ్వరరావు ఒప్పిచర్ల గ్రామ టిడిపి అధ్యక్షులు ఆముదాలపల్లి కృష్ణ పాల్గొన్నారు

ఇరువురి ప్రాణాలు కాపాడిన ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అత్యవసర చికిత్స ద్వారా ఇరువురి ప్రాణాలను కాపాడినట్లు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ వైద్యులు అచ్చంశెట్టి అన్వేష్ కుమార్ తెలిపారు. స్థానిక నాజ్ సెంటర్‌లో ఉన్న ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్వేష్‌కుమార్ ఇరువురి పేషంట్లకు సంబంధించిన ఆరోగ్య వివరాలు పేర్కొన్నారు. ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న 11 సంవత్సరాల పాపకు..గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న గంగాజలం (50 సంవత్సరాల)మహిళకు కీలకమైన ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. గుండె సంబంధిత సమస్యలకు సంబంధించి అన్ని రకాల సదుపాయాలు తమ హాస్పిటల్‌లో ఉన్నట్లు వెల్లడించారు. బైపాస్ సర్జరీలే కాకుండా మల్టిపుల్ హార్ట్ సర్జరీస్ చేయడం తమ ప్రత్యేకత అని అన్నారు. దీర్ఘకాలిక రోగాలకు సంబంధించిన అన్నిరకాల వ్యాధ్యులకు చికిత్స అందించడమే లక్ష్యంగా ప్రైమ్స్ ఆసుపత్రి వైద్య నిపుణులు 24 గంటలు అందుబాటులో ఉంటారని డాక్టర్ అన్వేష్ కుమార్ వెల్లడించారు. మీడియా సమావేశంలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పేరం కొప్పుస్వామి, డాక్టర్ సాయి రాజశేఖర్ కాసుల, డాక్టర్ తేజస్విని జల్లేపల్లి, డాక్టర్ పవన్ కుమార్ బదుగు, ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్, హాస్పిటల్ సీఈఓ పార్థ సారథి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల ఇబ్బందులు

విశాలాంధ్ర, తెనాలి : విద్యుత్ బిల్లుల చెల్లింపులో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లింపు ప్రక్రియలో నూతనంగా వచ్చిన మార్పులే ఇందుకు కారణంగా పలువురు చెబుతున్నారు. విద్యుత్ కార్యాలయాలలో బిల్లులు చెల్లింపునకు వచ్చిన వినియోగదారులకు కార్యాలయ సిబ్బంది పనితీరు కారణంగా గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. తెనాలి చెంచుపేటలోని విద్యుత్ కార్యలయంలో బిల్లుల చెల్లింపునకు వస్తున్న వినియోగదారుల సేవార్థం రెండు కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 1 గంట వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుండి 4 గంటల వరకు ఈ కౌంటర్లు పనిచేయాల్సి వుంది. అయితే ఒక కౌంటర్‌లోని సిబ్బంది తనకు పని వుంది బయటకు వెళ్ళాలని మధ్యాహ్నం 12 గంటలకు తన కౌంటర్ మూసివేశారు. దీనితో ఒకటే కౌంటర్ కావడంతో విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ఎక్కువ సేపు లైన్లో నిలబడాల్సి వస్తుందని వినియోగదారులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి విద్యుత్ బిల్లుల చెల్లింపులో వినియోగదారులకు కౌంటర్ తెరిపించాలని వారు కోరుతున్నారు.